# సొంత మనిషి



## సియస్.రావు

వేసవి సాయంకాలం. చల్లగాలి అప్పుడే తిరిగింది. చల్లని చిరుగాలి తాకిడికి కోనేరు పులకించి తుళ్ళితుళ్ళి పడుతోంది. కోనేటిలో చెలరేగిన చిన్నారి అలలు పోటీపడి ఒడ్డుకు చేరుకుని విరిగి పోతున్నాయి.

కోనేటి ఒడ్డువాలులలో మెత్తగా పెరిగిన పచ్చికమీద వాసు ఎడమచేతి

మోచేతిమీద ఆని పడుకున్నాడు. ఎదురుగా తామరాకుల మీద మెరుస్తోన్న నీటి ముత్యాలను, చిరుగాలిలో ఆడుకుంటూన్న తామర పూలను రెప్పార్పకుండా చూస్తున్నాడతను. కాలేజీలకి శలవులు యిచ్చాక, పట్నంనుంచి తన వూరుకు తిరిగివచ్చి వేసవి సాయంకాలాలు అలా గడపడం అలవాటు వాసుకి. వాసులాగనే మరికొందరు అక్కడికి చేరతారు. పరిచయస్తులు పిచ్చాపాటి మాట్లాడుకొంటారు. రాజకీయాలు, సినీమాలు, పత్రికలు, వేదాంతం...వాళ్ళ వాళ్ళ వయసుల్నిబట్టి, అభిరుచుల్నిబట్టి చర్చనీయాంశా లక్కడ. కాని వాసు వంటరిగా కూర్చున్నాడు. ఏం తోచక కోనేటి అందాన్ని తనివితీరా చూస్తున్నాడు. ఇంతలో చేతికి ఓ చిన్న రాయి దొరికింది. రాయిని తీసుకుని ఓ తామర పువ్వుకి గురిచూసి విసిరాడు. గురితప్పి రాయి కోనేటిలో పడింది. కలకలాన్ని రేపింది. తామరాకుమీద నీటి బిందువులు రాక్ అండ్ రోల్ ఆడాయి. తామర పూలు బిత్తరపోయి తలలు విదిలించాయి. యిదంతా మరీ అందంగా తోచింది వాసుకు. మరో రాయి తీసుకుని, రెండు మూడు సార్లు ఎగరేసి ఓ పూవును గురిచూస్తుండగా; తన వెనకనే వున్న జగన్నాథస్వామి ఆలయంలో దీపాలు వెలిగాయి. తనకెదురుగా ఆవలి ఒడ్డున వున్న సినిమాహాలు దీపాలూ వెలిగాయి.

చిరుచీకటి అలుముకుంటోంది. దీపాలు బలాన్ని పుంజుకుంటున్నాయి. ఆలయం కొలనులో దీపాలకొండలా ప్రతిబింబిస్తోంది. ఎదుటి ఒడ్డున వున్న సినీమాహాలు దీపాలు మరీ కాంతిగా వుండడంతో గుడి ప్రతిబింబాన్ని మింగేసేటంత స్పష్టంగా సినీమాహాలు ప్రతిబింబం కోనేటిలో చోటు చేసుకుంది.

వాసు తన చేతిలోని రాయిని కేర్‌లెస్‌గా విసిరేసాడు. కోనేటిలోని గుడి, సినీమాహాలు వంకరటింకరగా కదిలాయి. ఇంతలో తన పక్కనే వున్న మెట్లమీద ఏదో శబ్దమైంది.

వాసు చూపులు మెట్లవైపు మళ్ళాయి. రెండు మేలిమి చేపలు సరసమాడుకొంటోన్నట్టు రెండు అందమైన పాదాలు తేట నీటిలో కదులుతున్నాయి. అతని చూపులు ఆ పాదాలమీంచి లంగా కుచ్చెళ్ళ మీదకు, అక్కడినుంచి పాలరాతిలా నున్నగా మెరిసే పొత్తికడుపుమీదకి, ఆపై అందాల దొంతరల మీదకి ఎగబాకి, చివరకు విరిసిన రోజాలాంటి పరిచయమున్న ముఖంమీద ఆగిపోయాయి.

అతని చూపులకు సమాధానంగా పలకరింపుగా నవ్వింది సుజాత. చేతిలోని పూలసజ్జ నూపుకొంటూ ఆలయంలోకెళ్ళిపోయింది. ఆమె నవ్వినపుడు తనూ నవ్వాననుకున్నా డతను. కాని తన నవ్వు సుజాత కగుపించిందో లేదో

నని అనుమానంగానే వుందతనికి. మరి కాస్త స్పష్టంగా నవ్వితే తన సొమ్మేం పోతుంది? జీవితంలో వున్న పేదరికాన్ని నవ్వులోకూడ కనపరచకుండా వుండ లేకపోయాననుకున్నా డతను.

సుజాతా వాసూ పట్నంలో ఒకే కాలేజీలో బి.ఏ. చదివారు. యిద్దరూ ఫైనలియర్ పరీక్షలు రాసి తమవూరు వేసవి శలవులకి తిరిగి వచ్చేశారు. కాలేజీలో రోజూ ఒకరి నొకరు చూస్తూవున్నా, ఒకే వూరి వాళ్ళైనా ఎదురుపడి ఎన్నడూ మాట్లాడుకోలేదు. సుజాత ప్రెసిడెంట్ గారి అమ్మాయి. వాసు ఎలిమెంటరీ స్కూలు మాష్టారబ్బాయి. 'ఆమె పెద్దింటి పిల్ల. డాబూ దర్పం ఎక్కువ. తను సామాన్యుడు. అందుకే ఆమెకంత గర్వం.' అనుకొనేవాడతను.

'అతనికి తెలివైన వాడినని గర్వం. లెక్చరర్స్ అంతా మెచ్చుకుంటారని, కాలేజీ ఫస్ట్ వస్తానని అహం.' అనుకునే దామె.

అందుకే వాళ్ళిద్దరి మధ్యా వాళ్ళ మనస్సులే గోడలు కట్టాయి.

అట్లాంటి పరిస్థితుల్లో ఆ చల్లని సాయంత్రపు వేళ కోనేటి ఒడ్డున సుజాత నవ్వేసరికి ఒక్క క్షణం వాసు ఉబ్బి తబ్బిబ్బయ్యాడు. ఆ నవ్వును మళ్ళీమళ్ళీ గుర్తుచేసుకున్నాడు. మనసులో మాటలకందని తీయని భావాలు గుసగుసలాడాయి.

వాసు లేచి ఆలయంలోకి బయలు దేరాడు. అప్పటికే సుజాత ఆలయం చుట్టూ ప్రదక్షిణంచేసి, దేవుడిముందు నిలబడి, పూజారి చేతికి పూలసజ్జ, కొబ్బరికాయ అందించింది. పూజారి కొబ్బరికాయ కొట్టి, ఓ చెక్క, కొన్ని పూలు సజ్జలో వుంచి ఆమె చేతికందించాడు. దేవునికి చివరిసారిగా నమస్కరించి, కొన్ని పూలు తలలో ముడుచుకొని, వెనక్కి తిరగబోతూండగా, వెనక జయగంటమోగింది. సుజాత వులిక్కిపడింది.

ఎన్నడూ పలుకరించని సుజాత 'మీరా!' అన్నట్టు కళ్ళతోనే పలుకరించింది.

'పెదవి కదిపితే ముత్యాలు రాలి పోతాయికాబోలు?' అనుకొన్నాడు వాసు.

ఆమె నెమ్మదిగా గుడి ద్వారంవైపు నడుస్తోంది.

వాసు వెనకనే నడిచి నెమ్మదిగా ఆమె పక్కకు చేరాడు. అతనలా తన పక్కనే నడుస్తుంటే సిగ్గనిపించింది సుజాతకి.

'కాస్త ముందుకు నడిచిపోదేం?' అనుకుంది.

'గుడి ద్వారం అప్పుడే వచ్చేస్తోంది. యిలా జంటగా నడవటం యింక నాలు గడుగులేనా? రోడ్డెక్కి జనంమధ్య యిలా యీ వూళ్లో నడవడం ... !' ఆలోచన సాగలేదు వాసుకి.

గుడిద్వారం ఒక్కడుగులో వుంది. వాసు తుమ్మాడు.

ఆమె ద్వారాన్ని దాటబోతూ ఆగి, 'దాటకూడదనా?' అంది నవ్వుతూ.

'అహ! అబ్బే! కాదు.' కంగారు పడ్డాడు వాసు.

ఆమె నవ్వేసింది. అతనూ నవ్వాడు.

'వస్తానూ!' అంటూ అడుగు ముందుకేసింది.

'ఎప్పుడూ?'

'రోజూ'

ఆమె వెళ్ళినవైపే చూస్తూ వుండిపోయాడు. వెనక జయగంట మోగింది. మనసు తీయని వూహల్ని ఆలపిస్తోంది. ఆ క్షణంనుంచే వాసు క్షణాలు, నిమిషాలు, గంటలు లెక్కపెట్టడం మొదలెట్టాడు, రేపటి సాయంత్రం కోసం.

మరునాటి సాయంత్రం నీరెండ వేళకే కోనేటి తీరానికి చేరాడు వాసు. అతని దృష్టి కోనేటి అందాల మీద లేదు. చీమ చిటుక్కుమన్నా పావంచాల వైపే చూపులు నిల్చిపోతున్నాయి. యింకా కోనేటిలో దీపాల కొండా, సినీమాహాలు నీడా చోటుచేసుకోలేదు.

కాని, మేలిమి చేపలు పావంచాలమీద కదిలాయి. వాసు కళ్ళు మెరిసాయి. మోచేతి మీద ఆని పడుకున్నవాడు, లేచి కూర్చున్నాడు.

ఆమె నిన్నటిలాగే నవ్వింది. తనూ నవ్వాడు. కాని యీసారి చాలా స్పష్టంగా నవ్వాడు. ఆమె ఆలయంలోకి దారితీసింది. ద్వారందాటిన తర్వాత వెనక్కి తిరిగి చూసింది.

వాసు లేచి ఆమెను అనుసరించాడు. గుడిలోకి యింకా జనం చేరలేదు. ప్రదక్షిణాలు పూర్తయిన తర్వాత యిద్దరూ దేవుడి ముందు నిలబడ్డారు. ఆమె పక్కనే అతను. పూజారి ప్రసాదం అందించాడు యిద్దరికీ. అలా వాళ్ళిద్దరూ నిలబడిబడినపుడు 'యిదే నిజమైతే!' అనిపించిందతనికి.

ఆమె బయటికి నడుస్తూ 'మన రిజల్ట్సు ఎప్పుడు వస్తాయట?' అంది.

'ఏమో'

'ఈ నెలాఖరులోగా రావచ్చా?'

'రావచ్చేమో.'

'మీకు బాధేముందిలెండి. కాలేజీకే ఫస్టు వచ్చేవారికి'

'మీరు మాత్రం.'


'పాసైతే చాలు.'

'అందుకేనా యీ పూజలు?'

'పేపర్లు ఆన్సర్ చేసేది, కరెక్టు చేసేది దేవుడు కాదని నాకూ తెలుసు వస్తానూ.' అంటూ గడపదాటబోయి ఆగింది.

అతని కళ్ళల్లోకి కొంటెగా చూసి. 'తుమ్మకండేం!' అంది నవ్వుతూ.

'రోజూనా! నిన్నంటే ఏక్సిడెంట్.' ఆమె వెళ్ళిపోయింది.




'రేపు మళ్ళీ వస్తుందో రాదో?' అనుకున్నాడు వాసు.

'రోజూ వస్తానని నిన్ననే చెప్పిందిగా. రేపు ఆమె రాగానే రిజల్ట్సు గురించి నేనే ముందుగా మాట్లాడటం మొదలెడతాను. ప్రదక్షిణ చేస్తూన్నంత సేపూ మాట్లాడుతూనే వుంటాను' అనుకున్నాడు.

మరునాటి సాయంత్రం యింకా త్వరగా వచ్చాడు వాసు. చాలా సేపు కళ్ళు కాయలు కాచేలా పావంచాలవైపే చూస్తూ కూర్చున్నాడు. ఆమె రానే వచ్చింది. పావంచాలమీద మేలిమి చేపలు ఆడుకున్నాయి. ఆలయంవైపు నడిచాయి. వాసు వెంటపడ్డాడు.

ఆమె ద్వారం దాటి లోపలికి అడుగు పెట్టి, తన పక్కనే వున్న అతన్ని చూసి, నవ్వాపుకోలేక పోయింది. ఫకాలుమని నవ్వేసింది.

'మన రిజల్ట్సు యీ నెల ఆఖరి వారంలో వస్తాయట' అని చెప్పబోయాడు వాసు. నోటి మాట బయటికి రాలేదు.

'ఎందుకో నవ్వుతున్నారు!' అన్నాడు అమాయకంగా.

'మ రేం లే దు. మరికొన్నాళ్ళుపోతే మధ్యాన్నమే వచ్చి మండుటెండలో కోనేటి ఒడ్డున కూర్చుంటారేమోనని' అంది నవ్వాపుకుంటూ.

'నేనూ అదే భయపడుతున్నాను. చీకటి పడ్డాకగాని గుకికిరాని మీరు, పొద్దున్నే వచ్చేస్తారేమోనని.'

'ఆఁ.' అని వయ్యారంగా సాగదీసింది సుజాత.

'మన రిజల్ట్సు యీ నెల ఆఖరి వారంలో వస్తాయట' రిహార్సల్స్ వేసు

కున్న డైలాగ్ పప్పచెప్పసాగాడు వాసు ప్రదక్షిణ చేస్తూండగా.

'ఎవరన్నారు?' అందామె.

సమాధానం దొరకలేదతనికి. ఆమె అతని ముఖంలోకి కవ్వించినట్టుచూసి, కళ్ళు మూసుకొని గుడిచుట్టూ తిరగడం మొదలెట్టింది. అతను ఆమెనేచూస్తూ కూడా నడుస్తున్నాడు. ఆమె కళ్ళు మూసుకొని అతన్నే చూస్తూ నడుస్తోంది. అలా ఆ రోజు వాళ్ళిద్దరూ చాలాసార్లు తిరిగారు గుడిచుట్టూ.

'యిప్పటికి పదిసార్లేనా తిరిగి వుంటాం గుడిచుట్టూ' అన్నాడు వాసు యింకా తిరగబోతున్న సుజాతతో.

అమె చటుక్కున ఆగి, అతని కళ్ళల్లోకి చూసింది. సిగ్గుముంచు కొచ్చిందామెకి. పమిటె కొంగు పళ్ళ మధ్య బిగించి దేవుడి దగ్గరికి పరు గెత్తింది. ఆమె పరుగులో ఏవో కొత్త అందాలు అగుపించాయి అతనికి. ఆమె వంటరిగానే ప్రసాదం తీసుకొని తిరిగి వచ్చింది. అతను ఆమెనే చూస్తూ నిలబడ్డాడు.

అమె అతని ముందు ఒక్కక్షణం ఆగి ఆలయం బయటకి నడవసాగింది.

'యింత త్వరగా యింటికివెళ్ళాలా?' అన్నాడు వాసు వెంటబడుతూ.

'యింటికంటె గుడేపదిలంఅంటారా?'

'మీరు బలే సరదాగా మాట్లాడతారు.'

'నేనా?'

'యేం? కాదా?'

ఆమె నిస్సారంగా నవ్వింది. 'ఈ వూరి పొలిమేరల్లోకి అడుగుపెట్టగానే సరదా చచ్చిపోతుంది వాసూ' అంది.

ఆమె అలా ఎందుకు అంటోందో అతనికి అర్థం కాలేదు.

'యీ మండపంలో కాసేపు కూర్చుని వెళ్ళకూడదూ?' అన్నాడతను.

'వద్దు వాసూ. కూర్చోలేదని ఏమీ అనుకోవద్దు. ఇక్కడ మనిద్దరం కూర్చోడం ఎవరి కంటేనాపడితే, ఆ కళ్ళుచూసి వూరుకోవు. నాన్నగారి దగ్గర నోరు చేసుకుంటాయి. అప్పుడిక యీ దేవుడికి కూడా దూరమౌతాను. మన వూరు పూర్తిగా పల్లెటూరూకాదు. పట్ట ణమూకాదు. ఇక్కడ అందరి గొడవలూ అందరికీ కావాలి. వస్తానూ' అంది నడుస్తూ.

'రేపూ...' అని ఏదో అనబోయాడు వాసు

ఆమె వినిపించుకోకుండా 'మన రిజల్టు వస్తే నాకు కాస్త చూసిచెబుతారు కదూ?' అంది గడపదాటుతూ.

'తప్పకుండా.'

అలా వాళ్ళిద్దరూ కలుసుకుంటూనే వున్నారు. మనస్సుల్లోని కోరికల్ని మాటల్లోకి మలచి ఒకరికొకరు చెప్పకోక పోయినా, ఒకరి మనస్సు ఒకరికి అర్థ మైంది. యిద్దరికీ చేరువకావాలన్న తహ తహ వుంది. ఒకటి కావాలన్న ఆశ వుంది.

రిజల్ట్సు వచ్చాయి. వాసు ఫస్టుక్లాస్‌లో పాసయ్యాడు. సుజాత సెకండుక్లాస్‌లో పాసయ్యింది. పేపరు చూడగానే వాసు తండ్రితో చెప్పాడు.

'బాగుంది బాబు' అన్నారాయన.

' ఎం. ఎ.' కి అప్లై చేస్తా నాన్నా ' అన్నాడు వాసు.

'అలాగేరా. తొందరేం?'

'తొందర్లేదు. మీతో చెబుతున్నాను. అంతే'.

'డబ్బు చూసుకోవాలికదు బాబూ. మనకున్నది యింక యీ యిల్లు ఒక్కటే కదా బాబు.'

వాసు మాట్లాడలేదు.

"అలాగేరా. వెళ్ళి చదువుదువుగానిలే. నీకు స్కాలర్‌షిప్ కూడా రావచ్చు. చదువుదువుగానిలే. మనకి వున్నది యీ యిల్లు ఒక్కటే. నాకున్నదీ నీవొక్కడివే కదా బాబు' అన్నారాయన.

వాసు కళ్ళు చెమ్మగిల్లాయి.

వెళ్ళి సుజాతతో చెప్పాలనుకొని బయటకెళ్ళాడు. ఉత్సాహంగా బయలుదేరినవాడు వెంటనే ఎందుకనో చటుక్కున ఆగిపోయాడు. మనసునిండా ఆలోచనలు ముసురుకున్నాయి.

తను సుజాత యింటికి వెడితే బయట ఎవరుంటారో ఆమెను ఎలా పిలవాలో అతనికి అర్థంకాలేదు. ఆమె యిల్లు పెద్ద బంగళా. ఆమె తండ్రికి పెద్దహోదా. ఆ వూరి ఛైర్మన్. తనువెళ్ళి గుమ్మంలో నిలబడితే 'ఎవరు కావాలి?' అని ఆయన అడిగితే, 'సుజాత' అని తను బెరుకు బెరుగ్గా అంటే, 'దేనికి?' అని ఆయన గర్జిస్తే—తలుచుకొనేసరికి వళ్ళు జలదరించింది.

పిల్లిలా 'రిజల్ట్సు వచ్చాయండి. చెబుదామని' అంటాడు తను.

'మాకూ పేపరు వస్తుంది. చూసాంలే. వెళ్ళు' అంటారాయన.

ఆ తరువాత యింక తను మాట్లాడేది ఏమీ వుండదు తన లేమి తనను మాట్లాడనీయదు. తనని పిరికివాడ్ని చేస్తుంది. కాలేజీ వాతావరణం వేరు. కలిమి లేమి అక్కడ పాలూ నీళ్ళలా కలవకపోయినా కొట్టొచ్చినట్టు కనబడవు. కాని వూళ్ళలో ఎదురు బొదురుగా నిలబడతాయి కలిమిలేములు. స్పష్టంగా కనబడతాయి, అనుకుంటూ అతను సుజాత యింటికివెళ్ళడంమానుకున్నాడు. సాయంత్రంకోసం క్షణం ఒకయుగంగా ఎదురుచూసాడు.

ఆలయంలో యిద్దరూ కలుసుకున్నారు.

'కంగ్రాట్యులేషన్స్' అంది సుజాత.

'సేమ్ టు యూ'.

'థేంక్స్'.

'ఎం. ఎ. లో చేరుతున్నారు కదూ?' అన్నాడు వాసు అది ఖాయం అన్నట్టు.

'మీరు?'

'నాదింకా కాస్త అనుమానం'.

'యేం?'

'డబ్బు విషయం.'

ఆమె అతని ముఖంలోకి చూసింది జాలిగా. అతను తలవంచుకున్నాడు.

'నేనూ ఎం.ఎ. లో, చేరడం అనుమానమే వాసూ' అంది సుజాత.

'యేం!' అన్నాడతను వులిక్కిపడి.

అతని ఆశలు వేరు. యిక్కడ స్వేచ్ఛగా మనసులువిప్పి మాట్లాడుకో లేకపోతున్నామనీ, యూనివర్సిటీలో అయితే కావలసినంత స్వేచ్ఛగామనసులు విప్పి మాట్లాడుకోవచ్చనీ, ఎన్నో కలలు కన్నాడతను. ఆమెకి ఎం. ఎ. చదవడానికి ఎటువంటి ఆటంకం వుండదనుకున్నాడు. కాని అతని వూహకి విరుద్ధంగా ఆమె ఎం. ఎ. లో చేరడం అనుమానం అనేసరికి అతను షాక్ తిన్నాడు.

'మరేం లేదు. ఎం. ఎ. అంటే యూనివర్సిటీకి వెళ్ళాలి. బి. ఏ. దాకా అంటే అక్కడ మా బంధువులున్నారు. యూనివర్సిటీలో చేరితే, అక్కడ బంధువులు లేకపోవడంతో హాస్టల్లోవుండాలి. నన్ను వంటరిగా హాస్టల్లో వుంచి చదివించడానికి మా నాన్నగారికి యిష్టంలేదు. ఆడపిల్లల్ని వంటరిగా వదిలితే పాడైపోతారని ఆయన నమ్మకం. డబ్బులేక మీరు చదవలేరు. డబ్బుండీ నామీద నా వాళ్ళకి నమ్మకంలేక, ఆడదాన్ని కావడంచేత నేను చదవలేను' అంది సుజాత.

'మరైతే' అని నసిగాడు.

'ఇంకింతే.'

ఆ రోజు వాళ్ళిద్దరి మనసులూ బాగా లేవు. చాలాసేపు మౌనంగా వుండిపోయారు. ఒకరికొకరు దూరమైపోతున్నట్లనిపించింది వాళ్ళిద్దరికీ.

వాళ్ళిద్దరూ రోజూ ఆలయంలో కలుసుకుంటూనే వున్నారు. ఓ రోజున ఆలయద్వారం దాటబోతూ 'రేపు ఆఖరిసారేమో వాసు నేను నిన్ను ఆలయంలో కలుసుకోవడం' అంది సుజాత.

అతను అర్థంకానట్లు చూసాడు ఆమె ముఖంలోకి.

'నాకు పెళ్ళి కుదిరిందట'.

'మరినువ్వు పెళ్ళికొడుకునిచూసావా?'

'పెళ్ళికి రా వాసూ! యిద్దరం కలిసే చూద్దాం.'

'నువ్వు చూడలేదా అయితే?'

'నాన్నగారి వుద్దేశ్యంలో నే చూడనవసరంలేదు. అయినా చూసేదేం వుందిలే? లక్షల ఆస్థి వుందట. చాల్దా? అంతకంటె ఆడదానికేం కావాలి. మాలాంటి వున్నవాళ్ళకి అంతకంటె కావాల్సిందేవుంది?' అంది సుజాత. ఆ మాటల వెనక ఎంతో బాధ కొట్టొచ్చినట్టు అగుపించింది వాసుకి.

అతనికేం మాట్లాడడానికి తోచలేదు. మౌనంగా వుండిపోయాడు తలవంచుకొని.

'రేపు తప్పకుండా రా వాసు. శుభలేఖ యిస్తాను. మళ్ళీ మా నాన్నగారు శుభలేఖ

యివ్వడం అంటే, ఆయన లిష్టులో నీలాంటివాళ్ళ పేర్లు వుండకపోవచ్చు. వస్తావు కదూ?' అంది సుజాత.

అతను తలవూపాడు. ఇంత దూరం వచ్చిందని అతను వూహించలేదు. నిజానికి అంతదూరం వచ్చేదాకా సుజాతకే తెలీదు.

'ఎప్పుడూ నేనే వస్తానని చెప్పి వెళ్ళేదాన్ని. యీ రోజున మాత్రం నువ్వు రేపు తప్పక వస్తావుకదూ అని అడుగుతున్నాను. తప్పక వస్తావుకదూ?' అంది సుజాత.

'ఊఁ' అనిమాత్రం అనగలిగాడు వాసు.

సుజాత ఆలయద్వారందాటి రోడ్డెక్కి కళ్ళు వొత్తుకుని యింటివైపు నడిచింది. ఆమె వెళ్ళినవైపే చూస్తూ నిలబడిన వాసుకి పరిసరాలన్నీ కన్నీటి తెరవెనుక నుంచి మసకమసగ్గా అగుపించాయి.

మరునాటి సాయంత్రం సుజాత ఆలయానికి వచ్చింది. నిత్యం సెలయేరులా వచ్చే సుజాత ఆనాడు గంభీరంగా ప్రవహించే నిండునదిలా వచ్చింది. పావంచాల మీద కాళ్ళుకడుక్కుంటూనే వాసుని 'రా వాసూ' అని పిలిచింది.

అతను తనచుట్టూ చూసుకున్నాడు ఎవరేనా వున్నారేమోనని. అతని చూపులు 'నువ్వు పరాయిదానివి' అన్నట్లు వున్నాయి.

ఆమె విరిగిన అలలా నవ్వింది.

యిద్దరూ ఆలయంలో కెళ్ళారు.

'ఈరోజున నామనసు పంజరంలోంచి బయటపడిన చిలుకలా వుంది వాసూ' అంది సుజాత విశాలమైన ఆకాశంవైపు చూస్తూ.

ఆమె ఆలయంలోని దేవుడి దగ్గర కెళ్ళకుండా మండపంవైపు దారితీసింది. 'రా వాసూ! కూర్చో'. అంది సుజాత మండపంచేరి కూర్చుంటూ.

'అదేమిటి? దైవదర్శనం చేసుకోవా?' అన్నాడు వాసు.

"నోరు నెప్పిపుట్టేలా ఆ దేవుడ్ని వరాలు అడిగి అడిగి అలసిపోయాను వాసూ! ఆ రాయి పలకదని తేలిపోయింది. తోటిమనిషితోటే మొరపెట్టుకుంటేమంచిదనిపించింది' అంది సుజాత.

ఆమె ధోరణి వింతగా తోచింది వాసుకి.

'కూర్చో వాసూ! ఈ రోజున యీ మండపంలో ఎంతసేపు కూర్చోమన్నా కూర్చుంటా నీ పక్కన. నువ్వెక్కడికి తీసుకువెడతానన్నా వస్తా నీతో. ఈరోజు దాటితే జీవితంలో యింక నా రోజనేదే వుండదేమో'.

అతను ఆమెపక్కనే బెరుకుబెరుగ్గా కూర్చున్నాడు. అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుందామె. అతని చేతులు చల్లగా వున్నాయి. వెనక్కి లాక్కున్నాడు అతను తన చేతుల్ని. అలా

లాక్కోవడం 'నువ్వు పరాయిదానివి' అన్నట్టు అనిపించిందామెకి.

'నాకింకా ఎవరూ తాళికట్టలేదు వాసూ' అంది.

'కాని ప్రధానం అయిందిగా'.

'పీటలమీద పెళ్ళిళ్ళే ఆగిపోతూవుంటే ప్రధానం ఒక బంధమా వాసూ?'

'శుభలేఖలుకూడా అచ్చయ్యాయి గా.'

'అది నా తప్పా?'

అతని గుండెలు కొట్టుకుంటున్నాయి. తప్పు చేస్తున్నవాడిలా వణికిపోతున్నాడతను.

'అబ్బే యేంలేదు. గుడిలో మనం యిలాటి విషయాలు మాట్లాడుకోవడం ...' అంటూ నసిగాడు.

'అదే వాసూ నాకూ అనిపిస్తోంది. నిజంగా యీ ఆలయాలు కనిపెట్టిన వాడెవడోకాని—యివి కూడా లేకపోతే యిలాంటి వూళ్ళలో మనలాంటి వాళ్ళం మనసువిప్పి మాట్లాడుకోవడానికే అవకాశం వుండదు సుమా' అంది సుజాత.

'ఛ! ఏం మాటలవి?'

'నిజం వాసూ! అది సరే! ఈలాంటి రోజు మళ్ళీ మనకిరాకపోవచ్చు. రాకపోవచ్చేమిటి? నిజంగానే మనకిరాదు. ఏం మాట్లాడాలని వుందో మనసువిప్పి నిర్భయంగా మాట్లాడు. నేనైతే దేనికీ ఎవ్వరికీ భయపడను. నేను నీ దాన్నే అనుకో. నీతో ఎంతదూరం రమ్మన్నా, ఎక్కడికి రమ్మన్నా వస్తాను. నీయిష్టం.'

'తప్పు సుజాతా. నాకంత ధైర్యం లేదు. వస్తా' అంటూ లేచాడు వాసు.

'ఎప్పుడూ?' గొంతు బొంగురుపోయింది సుజాతకి.

'చనిపోయే లోపున' అందామనుకున్నాడు వాసు. నోటమాటరాలేదు.

అతను లేచి నిలబడ్డాడు.


'వాసూ! ఒక్క మాటంటాను. నొచ్చుకోకేం?' అంది సుజాత. ఏమిటన్నట్టు చూసాడతను.

'నువ్వు మధ్యతరగతివాడివి వాసు. నీకు గట్సులేవు. ధైర్యం తక్కువ నీకు. పెద్ద చదువులు చదివి నువ్వూ నా అంతస్థుకి చేరుకుని నన్ను నీదాన్ని చేసుకోవాలనుకున్నావు. కాని అందాకా పరిస్థితులు వూరుకోవే. నువ్వు లేనివాడివని నీకు ప్రతిక్షణమూ గుర్తే. ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ ఎక్కువ నీకు. నిన్ను గురించి నేనే తప్పుడంచనా వేసుకున్నాను. ఔనులే! నీ క్లాసు వేరు. నా క్లాసు వేరు. మనం ఎలా కలుస్తాం. మనుషులు సృష్టించిన ఈ క్లాసులు మనుషుల్ని దూరందూరంగానే వుంచుతాయి. మనసులున్నా మనుషుల మధ్య అగాధాలని సృష్టిస్తాయి.—ఇదిగో శుభలేఖ. పెళ్ళికి రా. వీలైతే' అంటూ శుభలేఖ అందించింది సుజాత.

వాసు ముళ్ళమీద నిలబడినట్టు నిలబడ్డాడు.

'పిరికివాడు' అనుకుంది.

* * *




వాసు తండ్రినొప్పించి ఎం.ఎ. లో చేరాడు. పాసయ్యాడు. అయిదుసంవత్సరాలు ఆడుతూ పాడుతూగడిచిపోయాయి. మనసు పాడుచేసుకోలేదతను. నిలదొక్కుకున్నాడు. ప్రపంచాన్ని తెలుసుకున్నాడు. మండపంలో చివరిసారి సుజాత తనని కలసినరోజు అనుక్షణం ఆతని గుండెల్లో మెదులుతూనే వుండేదింతకాలం. అతని అప్రయోజకత్వానికి ఆతనే లోలోపల మధనపడేవాడప్పుడు. మంచి వుద్యోగం దొరికింది. జీవితంలో స్థిరపడ్డాడు.

ఓ రోజున పెట్టిపెరిగిన వూరికివచ్చాడతను. అదేరోజు సాయంత్రం కోనేటి తీరానికొచ్చి నడుం వాల్చాడు. పాత స్మృతులు అలల్లా కదిలాయి మనసులో.

పావంచాలమీద నీళ్ళగలగల. అతని చూపులటు మళ్ళాయి. ఆవే పాదాలు— అందమైన మేలిమిచేపలు – తేట నీటిలో సయ్యాట. మనస్సు వులిక్కిపడింది.

ఆమె చేయిపట్టుకొని నాలుగేళ్ళ పసివాడు.

చూపులు చురుగ్గా పైకినడిచాయి. అదే ముఖం. కాని యిప్పుడిదివరకటి కళలేదు. అదే పలకరింపుచూపు – ఆ చూపులో యిదివరకటి మెరుపులేదు. అదే ముఖం. కాని యీనాడు సూర్యుడు లేని ఆకాశం. అతని గుండె గతుక్కుమంది.

ఆమెవెంటే ఆలయంలోకి నడిచాడు.

'ఈ బాబు?' అన్నాడు ఆలయంలోకి అడుగుపెడుతూ.

'నా బాబు' అంది సుజాత.

'మీ వారు...?'.

'పోయారు'. ఆ సమాధానం నిర్లిప్తంగా వుంది. అతి సామాన్యమైన విషయంలా చెప్పిందామె.

'ఈ మండపంలో కాసేపు కూర్చుందామా ?' అన్నాడతను.

'ఓ, అలాగే.'

'నాకింకా పెళ్ళికాలేదు.'

'నా జీవితం చివరి ముక్తాయింపుకి చేరువగావుంది' అనుకుంది మనసులో ఆమె.

'నా కాళ్ళమీద నేను నిలబడగలను. నాకు మంచి వుద్యోగంవుంది.'

'చాలా సంతోషం.'

'అదికాదు సుజాతా ! నీ సమాధానం కావాలి నాకు.' అన్నాడు అనునయంగా.

'నీ కింత ధైర్యం ఎప్పుడొచ్చింది ?' ఎక్కడ్నించి వచ్చింది ?' అన్నట్టు చూసింది సుజాత.

'నువ్వు సరేనంటే నిన్ను నేను...'

'లేవదీసుకుపోతావా ?'

'ఛ, పెళ్ళిచేసుకుంటాను!'

ఆమె నవ్వింది. 'నాకు బాబున్నాడు వాసూ !'

'అయినా ఫరవాలేదు.'

'వీడితండ్రివి నీవుకాదు. వీడు పరాయి తండ్రి కన్నబిడ్డ.'

'నీ బిడ్డను నా బిడ్డగా చూసుకోగలను'.

'ఇంతధైర్యం నీ అంతస్థు పెరగబట్టి వచ్చిందా వాసూ ?'

అతను మాట్లాడలేదు.

'పిచ్చివాసు', ఓనాడు నేను చేయిచాచినా నువ్వు అందుకోలేని పిరికివాడివి. ఈనాడు నువ్వు చేయిచాచినా నేను నా చేతిని నీ కందివ్వడానికి, నా చేతులు వెనక్కివిరిచి కట్టివేయబడ్డాయి. నాకు కావలసింది నీలాంటివారుకారు వాసు. నీ స్వభావం ద్రవపదార్థం స్వభావం లాంటిది. ఏ పాత్రలోపోస్తే ఆ పాత్ర ఆకారంలో యిమిడిపోయే స్వభావం. నాక్కావలసిన వాసూ, నే కోరుకున్న వాసూ – ఈ వ్యవస్థనే ఎదిరించి నిలబడగలిగినవాడు. గుండెధైర్యం గలవాడు. ఆ వాసు నీలోలేడు. నీ వుద్యోగంపోయిందనుకో – నువ్వు మళ్ళీ పాతవాసువే. నన్ను వదిలేసినా వదిలేస్తావు. వద్దులే వాసూ. నీ బతుకు నువ్వు బతుకు. నన్ను నా బాబుకోసం మన సాంప్రదాయాలకి తలవంచి బతకనీ – వుయార్ యిండియన్స్ వాసూ–వుయార్ యిండియన్స్ ! వీడికి యిద్దరు తండ్రులని ఈ సంఘానికి తెలిస్తే వీడ్ని కాకుల్లా పొడుస్తారు జనం– వస్తానూ' అనిచెప్పి లేచింది సుజాత.

'ఇంక నువ్వెన్నటికి రావు.' అనుకున్నాడు వాసు.

